సాక్షి తిరుపతి

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



పంపిణీ అయోమయం!

ఈ సారి పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యం కానుంది. గోడౌన్ మార్పునకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. - 8లో



మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. - 8లో



దోస..నష్టాల గోస!

వాకాడు: మండలంలో దోస రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కిలో రూ.5 కూడా పలకడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



ఆలయంలో బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు, పండుగలు కావడంతో సుమారు 32 వేల మంది భక్తులు దర్శించుకుని ఉంటారని ఆలయ అధికారులు తెలిపారు. అన్ని రకాల రాహు–కేతు పూజలు సుమారు 4 వేలకు పైగా జరిగాయి. ప్రసాదాలు పెద్ద సంఖ్యలో విక్రయించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆ మేరకు ఇప్పటికే డీఆర్‌డీఏ పీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓతోపాటు పలువురు అధికారులకు ఆదేశాలిచ్చినట్టు వెల్లడించారు. ఏ కారణం చేతనైనా 300 మీటర్ల దూరం కన్నా మించి పింఛన్ ఇవ్వాల్సి వస్తే అందుకు తగిన కారణాలు వెల్లడించాలని ఆదేశించారు.

ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారిగా మధుసూదన్‌రావు



తిరుపతి అర్బన్: ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారిగా మళ్లీ మధుసూదన్‌రావు మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గత ఏడాది డిసెంబర్ 19న ఆయన సెలవుపై వెళ్లారు. ఆ తర్వాత ఈఈగా పనిచేస్తున్న రెడ్డెయ్యకు ఇన్‌చార్జి జిల్లా అధికారిగా పగ్గాలు అప్పగించారు. అయితే రెడ్డెయ్య సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో మళ్లీ మధుసూదన్‌రావు 100 రోజుల తర్వాత జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారిగా పగ్గాలు చేపట్టనున్నారు.

శ్రీపద్మావతీ అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు వారికి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ముఖమండపంలో వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారికి చేసిన కుంకుమార్చనలో ఉపయోగించిన పసుపు, కుంకుమను అందజేశారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఈ నెల ఒకటో తేదీన యథావిధిగా నిర్వహించాలని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈదుల్ ఫితర్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీన ఆప్షనల్ సెలవును ప్రకటించిందన్నారు. మంగళవారం పాఠశాలలు యథావిధిగా నిర్వహించాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ముస్లింల సామూహిక నమాజ్‌లతో పులకించిన ఈద్గాలు, మసీదులు
- అరకొర సౌకర్యాలతో తప్పని తిప్పలు



తిరుపతి ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థన

తిరుపతి కల్చరల్: పరమ పవిత్రమైన రంజాన్ సంబరాలను సోమవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసి చివరి రోజు అయిన ఆదివారం రాత్రి నెల వంకను సందర్శించి సోమవారం ఉదయం రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజుకు సిద్ధమయ్యారు. తిరుపతితో పాటు శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఈద్గాలు, దర్గాలు



ప్రత్యేక ప్రార్థనలో చిన్నారులు

కిటకిటలాడాయి. పలువురు రాజకీయ ప్రతినిధులు నమాజ్ ప్రాంతాలకు చేరుకుని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి ఎస్వీయూనివర్సిటీ సమీపంలోనున్న ఈద్గా మైదానంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వ ఖాజాసయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, గఫూర్, ముస్లిం జేఏసీ చైర్మన్ ముత్తూజా, ముస్లిం పెద్దలు, ముత్తవల్లిలు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో హాజరు

తిరుపతి ఈద్గా మైదానంలో అరకొర సౌకర్యాల మధ్య ముస్లింలు రంజాన్ నమాజ్ చేసుకునే పరిస్థితి నెలకొంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవతో రంజాన్ పండుగ నాడు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో ముస్లిం ప్రార్థల కోసం పూర్తి స్థాయిలో చలువ పందిళ్లు, కింద గ్రీన్ కార్పెంట్స్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఈద్గాలో సగం వరకే చలువ పందిళ్లు వేశారు. కొంత మంది ముస్లింలు ఎండలో మట్టి నేలపైనే మోకరిల్లి ప్రార్థనలు చేసుకునే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రంజాన్ పేరుతో సొమ్ము వసూలు చేశారనే ఆరోపణలు కూడా వినిపించాయి. వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్‌ఆర్‌సీపీ ముస్లిం నేతలు నల్లబ్యాడ్జీలతో నమాజ్‌కు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు.



తిరుపతి: మట్టిలోనే నమాజు చేస్తున్న ముస్లింలు

నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థన

చిల్లకూరు: గూడూరులోని నమాజ్ కట్ట వద్ద ఉన్న ఈద్గాలో నల్ల బ్యాడ్జీలు ధరించి ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టి ముస్లింలకు తీరని అన్యాయం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. దీన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించినట్లు ముస్లింలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్య దర్శి మగ్దూమ్ మోహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



నల్ల బ్యాడ్జీలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

తిరునగరిలో.. భూచోళ్లు!





తిరుపతి నగరంలో 'భూ'చోళ్లు రెచ్చిపోతున్నారు. అధిర అండదండలతో కబ్జాకోరులు చెలరేగిపోతున్నారు. ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు. రిజిస్ట్రేషన్ భూములైనా సరే.. ఖాళీగా కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిని చితకబాదుతున్నారు. దళితులు, అనామకులైతే పిడిగుద్దుల వర్షం కురిపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

బరితెగిస్తున్న కూటమి నేతలు

- విచ్చలవిడిగా ఆక్రమణలు
- బస్టాండ్, ఫుట్‌పాత్ స్థలాలు స్వాధీనం
- ఫేక్ రికార్డులతో రిజిస్ట్రేషన్లు
- కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఆధ్యాత్మిక నగరం చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటమి నేతలు బరితెగిస్తున్నారు. ఇది అన్యాయం అని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. అక్రమార్కులకు అధికారులు తోడవ్వడంతో నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.

దొంగ రికార్డులు.. అక్రమ రిజిస్ట్రేషన్లు

తిరుపతి రూరల్ మండలం, దామినేడు సర్వే నం.181/5లో 20 సెంట్ల విలువైన స్థలం ఉంది. ఇది మల్లికార్జునరెడ్డి, ధనలక్ష్మి పేరున రిజిస్టర్ భూమి. ప్రస్తుతం దీని విలువ రూ.5 కోట్లు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీకి చెందిన ఓ నాయకుడు దొంగ రికార్డులను సృష్టించి బినామీ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ టీడీపీ నేత అనుచరులతో రాత్రి సమయంలో ఆ భూమిలోకి చొరబడి కంచెను తొలగించి ఆక్రమించుకున్నారు. భూ యజమానులు వచ్చి తమ స్థలం అని చెప్పినా వినిపించుకోకుండా దౌర్జన్యానికి దిగారు. క్రిమినల్ కేసు నమోదైనా ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు లేవు. అదేవిధంగా బాధితులు మంత్రి లోకేష్‌ని కూడా ఆశ్రయించినట్లు సమాచారం. అయితే అటువైపు నుంచి ఎటువంటి స్పందన లేదు. తిరుపతి అర్బన్ మండలం, కొంకచెన్నాగుంట పరిధిలో రెండు సెంట్ల ప్రైవేటు స్థలంలోకి ఇదే టీడీపీ బ్యాచ్ చొరబడి ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. స్థల యజమానులు అడ్డుకునే ప్రయత్నం చేసే వారిపై దాడికి యత్నించినట్లు సమాచారం. బాధితులు అతి సామాన్యులు కావడంతో వారికి అడ్డే లేకుండా పోతోంది.

ఫుట్ పాత్‌నీ వదిలేది లేదు

అన్నమయ్య కూడలి వద్ద దూరదర్శన్ కేంద్రం ముందు మున్సిపల్ కార్పొరేషన్ వారు ఫుట్‌పాత్ నిర్మించారు. ఆ ఫుట్ పాత్‌పై పబ్లిక్ టాయ్‌లెట్ కూడా ఉంది. ఆ పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌ని టీడీపీకి చెందిన ఓ నాయకుడు ఆక్రమించాడు. రేకులతో బంక్‌ను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చాడు. అంతటితో ఆగని ఆక్రమార్కులు మరికొంత ఆక్రమించుకునేందుకు కాలువపై రేకులు కూడా ఏర్పాటు చేశారు. కళ్లముందే ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇలా నగరం చుట్టుపక్కల యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు వివాదం..నేడు కబ్జాల పర్వం

తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి– ఎంఆర్‌పల్లి రహదారి మార్గంలో ఆర్టీసీ బస్టాప్ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. పల్లెవెలుగు బస్సులు నిలిపేందుకు గతంలో రాయలచెరువు వద్ద స్థలం కేటాయించడంతో వివాదం తలెత్తింది. దాంతో నాడు బైరాగిపట్టెడ ఆర్చికి ఎదురుగా తుడా కొంత స్థలాన్ని కేటాయించింది. అప్పట్లో అక్కడ తాత్కాలిక బస్టాప్ కూడా ఏర్పాటు చేశారు. అయితే నేడు టీడీపీకి చెందిన ఓ నాయకుడు దర్జాగా ఆక్రమించుకుని చుట్టూ ప్రహరీ నిర్మాణం మొదలు పెట్టాడు. పక్కనే కాలువ పోరంబోకు స్థలాన్ని సైతం ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ స్థలం విలువ ప్రస్తుతం రూ.7 కోట్లుపై మాటే.

భూమాఫియా

నగరంలో కూటమికి చెందిన ఓ ఐదుగురు నేతలు ముఠాగా ఏర్పడి ఆక్రమణల పరంపరకు తెరలేపుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు ముందుగా వారి అనుచరులను దింపేస్తారు. ఆపై అధికారాన్ని అడ్డంపెట్టుకుని దొంగ రికార్డులు సృష్టించి తమ పేరున రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. బాధితులెవరైనా అడ్డుతగిలితే వారిపై దౌర్జన్యం చేయడం రివాజుగా మారుతోంది.



దూరదర్శన్ కేంద్రం ముందు ఫుట్‌పాత్‌ని ఆక్రమించుకుని ఇలా..



జాతీయ రహదారి పక్కనే ఆక్రమణకు గురైన ప్రయివేటు స్థలం



కొంకచెన్నాయి గుంట వద్ద ఆక్రమణకు గురైన స్థలం

25న ఏఎల్‌సీసీ విడుదల



ఏఎల్‌సీసీ చిత్రం స్టిల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దర్శకుడు, నటీ నటులు

తిరుపతి కల్చరల్: ఒక బ్యాచిలర్ తన జీవితంలో కష్టాలు ఎదుర్కొని ఎలా అనుకున్న లక్ష్యాన్ని సాధించారనే ఇతివృత్తంతో చక్కటి సందేశాత్మకంగా రూపొందించిన 'ఏఎల్‌సీసీ' సినిమా ఈనెల 25వ తేదీన విడుదలవుతుందని చిత్ర దర్శకుడు లేలీధర్ రావు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సినిమాకు సంబంధించిన పోస్టర్ స్టిల్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ చిత్రాన్ని 90 శాతం తిరుపతికి చెందిన నటీనటులతో తిరుపతి పరిసర ప్రాంతాల్లో రూపొందించామని తెలిపారు. బ్యాచిలర్‌గా ఉన్నప్పుడు జరిగే సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చేలా తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. సమావేశంలో నటీనటులు ధనుస్ దేవర, శ్రీనివాసులురెడ్డి, కమల్, జశ్వంత్, చరణ్ తేజ పాల్గొన్నారు.

పోలీసులకు ఉద్యోగ విరమణ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సత్కరిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి క్రైం: జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి నలుగురు పోలీసులు ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో ఏఎస్ఐలు ప్రసాద్, శివకుమార్, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి ఉన్నారు. వీరిని జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవి మనోహరాచారి ఘనంగా సత్కరించారు. వారి సేవలను ప్రస్తుతించారు.

నిఘా నీడలోనేనా?

- రేపటి నుంచి ఎస్వీయూ డీడీఈ పరీక్షలు
- రాష్ట్ర వ్యాప్తంగా 43, ఇతర రాష్ట్రాలలో 8 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 32 వేల మంది అభ్యర్థులు
- డెబ్ నిబంధనలు పాటించకుంటే కోర్టును ఆశ్రయిస్తామంటున్న విద్యార్థి సంఘాలు



ఎస్వీయూ డీడీఈ భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూరవిద్యా కేంద్రం పరిధిలో యూజీ, పీజీ పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఏడాదిగా సుమారు నాలుగు దఫాలుగా వాయిదా పడిన ఈ పరీక్షలు ఎట్టకేలకు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పరీక్షల నిర్వహణలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని, అవినీతి రాజ్యమేలుతోందని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థలలో పరీక్షలు నిర్వహించేందుకు పూనుకున్నారని విద్యార్థి సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. యూజీసీ డెబ్ నిబంధనలకు లోబడి పరీక్షలను ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహించాలని వర్సిటీ అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాలలోనూ, ఇతర రాష్ట్రాలలో మరో 8 సెంటర్లలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ పరీక్షలకు సుమారు 32 వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

నిబంధనలు అమలయ్యేనా?

డీడీఈ పరీక్షలు యూజీ డెబ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇప్పటికే న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలతో పాటు వీడియో రికార్డింగ్ చేపట్టి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. కానీ బుధవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టని పక్షంలో విద్యార్థి సంఘాలు మరోమారు న్యాయస్థానాల తలుపుతట్టేందుకు సిద్ధమవుతున్నారు. మాస్ కాపీయంగ్‌ను పూర్తి స్థాయిలో అరికట్టి నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. పరీక్షా కేంద్రాలను కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో మాత్రమే నిర్వహించాల్సి ఉందని డెబ్ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

సుదూరం సాధ్యమేనా?

డీడీఈ నిబంధనల ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 15 రోజుల ముందుగానే హాల్‌టికెట్లు జారీ చేయాల్సి ఉంది. కానీ అధికారులు పరీక్షలకు మూడు రోజుల ముందు శనివారం రోజు నుంచి హాల్‌టికెట్లును ఆల్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. దీంతో ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. తమకు శనివారం రోజున హాల్‌టికెట్లు అందిస్తే పనిచేస్తున్న కంపెనీలలో సెలవుకు దరఖాస్తు చేసుకుని సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం సాధ్యమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు స్టడీ సెంటర్ల నిర్వాహకులను సంప్రదించి తమగోడును విన్నవించుకుంటున్నారు. వర్సిటీ అధికారులు కనీసం అభ్యర్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం దారుణమని మండిపడుతున్నారు.

> **నిబంధనల మేరకే పరీక్షలు**
>
> 
>
> యూజీసీ నిబంధనల మేరకు ప్రభుత్వ కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాం. అదే కళాశాలలో పని చేసే అధ్యాపకులనే ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నాం. దీంతో పాటు పరీక్షా కేంద్రాలలో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం.
>
> –ఊక రమేష్‌బాబు, డైరెక్టర్, డీడీఈ, ఎస్వీయూ

గరుడ వాహనంపై కోదండరాముడు



గరుడ వాహనంపై కొలువైన కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అడుగడుగునా భక్తులకు హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం మోహినీ అవతారధారుడైన శ్రీరామచంద్ర మూర్తి పల్లకీలో కొలువై పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. తర్వాత గరుడ పాదుకలను ఊరేగించారు. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

సోమవారం రాత్రి నిర్వహించిన గరుడ సేవలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాబృందాలు ప్రదర్శించిన కళాప్రదర్శనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో కళాకారులు పాల్గొని తమదైన శైలిలో సంగీత, నృత్య ప్రదర్శనలతో అబ్బుర పరిచారు. బెంగళూరుకు చెందిన శ్రీపద్మావతి చెక్క భజన, కోలాటం, విశాఖపట్నంకు చెందిన భవదేయ ట్రస్ట్ సుగుణకుమారి 'దింసా' నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. అలాగే చంద్రగిరికి చెందిన 15 మంది చెక్క భజనతో మహిళా కళాకారులు, శ్రీగౌరీ శంకర కోలాట భజన అలరింపజేసింది.



పల్లకీలో మోహినీ అవతారంలో స్వామివారు



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం


తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.93,380
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.8,450
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.103,000
రిటైల్ వెండి గ్రాము రూ.106.00

క్లుప్తంగా

దేవాలయ నిర్మాణం పేరిట అక్రమ వసూళ్లు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరం 48వ వార్డులోని అన్నమయ్య నగర్‌లో అనధికార వ్యక్తులు ఆలయ నిర్మాణం పేరిట చందాలు వాసులు చేసి లక్షలు దోచుకున్నట్లు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అన్నమయ్య నగర్‌లో నూతనంగా శ్రీ సంకల్ప సిద్ధ వినాయక స్వామి ఆలయ నిర్మాణం కోసం కొందరు వ్యక్తులు చందాలు వసూలు చేస్తూ వచ్చారు. ఒక్కో ఇంటి నుంచి రూ.5 వేల చొప్పున విరాళాలు సేకరించారు. దానికితోడు రోడ్డుకు విడిచిపెట్టిన స్థలంలో ఆలయాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. అన్నమయ్య నగర్ వాసులు ఈ చందా వసూళ్లని, అక్రమ దేవాలయ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇందులో టీడీపీ నాయకులు ఉన్నట్లుగా సమాచారం.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 62,263 మంది స్వామివారిని దర్శించుకోగా 25,263 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందుగానే వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పుస్తకాల డిపో దూరం..
పంపిణీ అయోమయం!

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒకే పాఠ్యపుస్తకాల డిపో

- ప్రస్తుతం దాన్ని మార్చే ఆలోచనలో విద్యాశాఖ
- ఇదే జరిగే మరింత భారంతోపాటు సకాలంలో పుసకాలు అందడం కష్టమే



తిరుపతి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ భవనంలో ఉన్న పాఠ్యపుస్తకాల డిపో

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఆ దిశగా కసరత్తు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాకు ఉన్న పుస్తకాల డిపో అద్దెభవనంలో కొనసాగడం.. దీన్ని ప్రస్తుతం తిరుపతి జిల్లాకు మార్చాలనే ఆలోచన చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇలా జరిగితే పాఠశాల తెరిచిన మొదటి రోజు విద్యార్థులకు పుస్తకాలు అందడం గగనమేనని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు ప్రభుత్వంపై పెనుభారం తప్పదని చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో నూతన డిపోలకు కసరత్తు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పాఠశాలలతో పాటు అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంటుంది. తిరుపతి జిల్లా కేంద్రంలోని పుస్తకాల డిపో నుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తుంటారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక ఆయా జిల్లాల్లో నూతన పాఠ్యపుస్తకాల డిపోలను ఏర్పాటు చేయాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన జిల్లాల్లో డిపోల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అయితే నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నూతన డిపోల ఏర్పాటు కసరత్తు మరుగున పడిపోయింది.

కష్టతరమే

ప్రస్తుతం తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న పాఠ్యపుస్తకాల డిపో నుంచి చిత్తూరు జిల్లాలోని కుప్పంకు 185.7 కి.మీ., తిరుపతి నుంచి పుంగనూరుకు 137.2 కి.మీ దూరం ఉంటుంది. ఇంత దూరంలో ఉన్న మండలాలకు వెసులుబాటును బట్టి పలు మార్లు పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రతి మండలానికి ప్రత్యేక వాహనాల్లో పుస్తకాలను పంపాల్సి ఉంటుంది. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలంటే కసరత్తును విద్యాసంవత్సరం ప్రారంభానికి ఐదు నెలలకు ముందే అమలు చేయాలి. చిత్తూరు జిల్లాలో కొత్తగా పుస్తకాల డిపోను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో మొదటి రోజే పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ విద్యార్థులకు బడులు తెరిచిన తొలిరోజే పాఠ్యపుస్తకాలు అందాయంటే ఆ ఘనత వైఎస్సార్‌సీపీ పాలనలోనే అని విద్యావేత్తలు చెబుతున్నారు. 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి ఉండేది కాదు. విద్యాసంవత్సరం పూర్తవుతున్నా పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేయని దుస్థితి ఉండేది. అలాంటి పరిస్థితులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపుమాపింది.

పంపిణీకి కోట్లాది రూపాయల ఖర్చు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాలకు పాఠ్యపుస్తకాలను తిరుపతి పుస్తకాల డిపో నుంచే పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ డిపో ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో ఉండడంతో ఖాళీ చేయాలని యజమాని ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీంతో తిరుపతి జిల్లా కేంద్రంలోని పుస్తకాల డిపోను శ్రీకాళహస్తికి మార్పు చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అదే జరిగితే మరింత వ్యయంతో పాటు పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారనుంది.

తిరుపతి జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,934	94,178
ప్రాథమికోన్నత	188	57,801
ఉన్నత	322	35,465
మొత్తం	2,444	1,87,444

చిత్తూరు జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	2,436	1,41,217

కొత్త డిపో గుర్తించాలని గతంలో చెప్పారు

చిత్తూరు జిల్లాలో కొత్తగా పాఠ్యపుస్తకాల డిపోను గుర్తించాలని గతంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఆ మేరకు జిల్లా కేంద్రంలో కొన్ని భవనాలను పరిశీలించాం. ఆ తర్వాత నివేదికలు పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు రాలేదు. దీంతో మిన్నకుండిపోయాం. 2024–25 విద్యాసంవత్సరంలో తిరుపతి జిల్లా పాఠ్యపుస్తకాల డిపో నుంచే పుస్తకాలను పంపిణీ చేశారు. – వెంకటేశ్వరరావు, ఏడీ, డీఈవో కార్యాలయం, చిత్తూరు జిల్లా

డాక్టర్ జగదీష్‌కు అవార్డు


జగదీష్‌కు అవార్డు అందిస్తున్న మారిషస్ ప్రధాని

తిరుపతి తుడా : మారిషస్ తెలుగు మహా సభ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఫీనిక్స్‌లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గుడారు జగదీష్‌కు విశ్వ వైద్య దివ్యాంగ బంధు అవార్డును మారిషస్ ప్రధానమంత్రి ప్రదానం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చంద్రగిరి: రిజర్వు ఫారెస్టులో అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై అటవీ అధికారులు చర్యలకు పూనుకున్నారు. సోమవారం మండలంలోని మూలపల్లి చెరువు సమీపంలో రిజర్వ్ ఫారెస్టులో అధికార పార్టీకి చెందిన కొంతమంది ఇసుక తరలిస్తుండగా ఎఫ్‌బీఓ చిత్ర తన సిబ్బందితో కలసి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన వారిది కావడంతో ట్రాక్టర్‌ను విడిచిపెట్టాలంటూ తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఉదయం ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు సాయంత్రం అయినా కూడా కేసు నమోదు చేలేదు. దీనిపై ఎఫ్ఆర్ఓను వివరణ కోరగా.. రిజర్వు ఫారెస్టులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి నేరాల నియంత్రణ

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచి నేరాల నియంత్రణ కట్టడి చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో శాఖాపరంగా సాధించిన పురోగతి వివరాలను ఆయన వెల్లడించిన మేరకు..రోజూ స్పెషల్ పార్టీ పోలీసులు జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 2,966 మంది అనుమానితులను పోలీస్ స్టేషన్ కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

- గంజాయి అక్రమ రవాణా కేసుల్లో సుమారు 77.05 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 8 పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేశారు.
- బహిరంగంగా మద్యం సేవించే వారిపై 2,295 కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి జరిమానాలు విధించారు.
- బహిరంగంగా మద్యం సేవించే 143 ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేశారు.
- 2,321 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రోడ్లకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే 1584 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు.

తొట్టంబేడులో విచ్చలవిడిగా బెల్టుషాపులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో బెల్టుషాపుల ఏర్పాటు ఊపందుకుంది. ఏ గ్రామంలో చూసినా రెండు మూడు బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. మందుబాబులు బెల్టుషాపుల వద్దే ఫూటుగా మద్యం సేవించి పడిపోతున్నారు. ఇలాంటి ఘటనే ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కాసరం గ్రామానికి చెందిన కేతాశెట్టి శంకరయ్య స్థానికంగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులో ఫూటుగా మద్యం సేవించి పక్కనే ఉన్న పందిరికింద పడిపోయాడు. ఊర కుక్కలు అతనిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ముఖం, కాళ్లను కొరికి వేయడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

చేమూరు మద్యం షాపు నుంచే సరఫరా!

తొట్టంబేడు మండలం, చేమూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపు విషయమై వివాదం నడుస్తోంది. స్థానికంగా మద్యం షాపు వద్దని గ్రామస్తులు మొత్తుకుంటున్నా అధికారులు వినకుండా అక్కడే మద్యం షాపుతోపాటు అక్కడే పర్మిట్ రూము ఏర్పాటుకు అనుమతిచ్చారు. ఈ షాపు నుంచి నిత్యం చుట్టుపక్కల గ్రామాల్లోని బెల్టుషాపులకు మద్యం సరఫరా అవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించాల్సి ఉంది.

ఏమిటీ ఘోరం ?




కాసరం గ్రామంలో గత రాత్రి జరిగిన ఘటన చాలా అమానుషం. ఇలాంటి ఘటనలు సమాజంలో విలువలు దిగజార్చే విధంగా ఉన్నాయి. పాలకులు, అధికారుల తీరుతోనే ఇలా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు కళ్లు మూసుకుని ఉంటున్నారు. అందుకే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.
– జనమాల గురవయ్య, సీపీఎం, శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి

విచ్చలవిడితనంతోనే దారుణాలు



కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతుండడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. గత రాత్రి కాసరంలో జరిగిన ఘటన చాలా దారుణం. బెల్టుషాపులో మద్యం సేవించి పడిపోయిన వ్యక్తిని పట్టించుకోకపోవడం బాధాకరం. అధికారులు దీనిపై స్పందించకపోవడం ఏమిటి ? ఇలాంటి దారుణాలు కూటమి ప్రభుత్వంలో చాలా జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోంది. ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి. – ఢిల్లీబాబు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా వలంటీరు అసోసియేషన్ అధ్యక్షుడు

సాదుభద్రేష్‌దాస్ స్వామికి సరస్వతీ సమ్మాన్ అవార్డు


సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత సాదు భద్రేష్‌దాస్ స్వామి

తిరుపతి సిటీ: ఢిల్లీ వేదికగా కేకే బిర్లా ఫౌండేషన్ మహామహోపాధ్యాయ సాదు భద్రేష్‌దాస్ స్వామికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సాహిత్య పురస్కారం 'సర్వతీ సమ్మాన్–2024' అవార్డును ప్రదానం చేసింది. అహ్మదాబాద్‌కు చెందిన ఆయన భారతీయ తత్వశాస్త్రంతో పాటు ప్రఖ్యాత సంస్కృత పండితుడిగా కీర్తిప్రతిష్టలు సంపాదించారు. సంస్కృతంలో ఆయన 'స్వామినారాయణ సిద్ధాంత సుధ' అనే పుస్తకాన్ని రచించినందుకుగాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీతో ఆయనకు గత ఐదేళ్ల నుంచి అవినాభావ సంబంధం ఏర్పడింది. ఆంజనేయస్వామి జన్మస్థలం తిరుమల గిరులే అన్న వాదాన్ని 2021–22లో ఆయన బలంగా వినిపించారు. అరుదైన ఘనతను సాధించిన ఆయనను వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిరసన


రంజాన్ ప్రార్థనకు నల్లబ్యాడ్జీలతో హాజరైన ముస్లింలు

చంద్రగిరి : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ముస్లింలు నిరసన తెలిపారు. ఈ మేరకు సోమవారం రెడ్డివారిపల్లె ఈద్గా మైదానంలో నిర్వహించిన రంజాన్ ప్రార్థనలకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తుల భద్రతను దెబ్బతీసేలా, ముస్లింల హక్కులను కాలరాచే ఈ బిల్లును వెనక్కుతీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు ఆధీనంలోని భూముల హక్కులకు భంగం కలిగించకుండా సముచిత చర్యలు తీసుకోవాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశంలో ముస్లిం ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పునరాలోచించాలని సూచించారు. అనంతరం వక్ఫ్ భూముల రక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


మాట్లాడుతున్న కరస్పాండెంట్ డాక్టర్ సతీష్

సత్యవేడు: భవిష్యత్‌లో విద్యార్థులను యువశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే రోబోటెక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సన్‌రైజ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ తెలిపారు. సోమవారం సన్‌రైజ్ ఉన్నత పాఠశాలలో చైర్మన్ ఎస్.ప్రియాంక అధ్యక్షతన రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2డి, 3డి, ఎఎల్ రోబోటిక్స్ పై ప్రతి శుక్రవారం ప్రయోగాత్మకంగా ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం రోబోటిక్స్ రీజనల్ మేనేజర్ చరణ్ మాట్లాడారు. అనంతరం రోబోటిక్స్ పనితీరును ప్రయోగాత్మకంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఆశగోపాల్, ఉపాధ్యాయులు ఉమ, నిర్మల పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారిని చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో టీడీపీ కార్యకర్త హల్‌చల్

సాక్షి, టాస్క్‌ఫోర్: మద్యం మత్తులో టీడీపీ కార్యకర్త హల్‌చల్ చేశాడు. పోలీసు స్టేషన్ ఆవరణలో కేకలు వేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చంద్రగిరి పాతపేటకు చెందిన టీడీపీ కార్యకర్త తన స్నేహితులతో కలసి మల్లయ్యపల్లి మార్గంలోని ఓ ప్రైవేటు భూమిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నాడు. సాయంత్రం అటుగా వెళ్లిన ఓ పోలీసు అధికారి గుర్తించి, యువకులను మందలించి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. అయితే పాతపేటకు చెందిన టీడీపీ కార్యకర్త ఆ అధికారితో దురుసుగా ప్రవర్తించడంతో పాటు తామంతా అధికార పార్టీకి చెందిన వారిమని విర్రవీగారు. సిబ్బంది ఎంత వారించినా వినలేదు. అనంతరం టీడీపీ కార్యకర్త కొంతమందిని పోగేసుకుని మరోసారి స్టేషన్ వద్దకు వచ్చి హల్‌చల్ చేశాడు. కేకలు వేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో అధికార పార్టీకి చెందిన నాయకులు స్టేషన్ వద్దకు చేరుకుని, అధికారితో మంతనాలు జరిపారు. మరోమారు ఇలాంటివి చోటు చేసుకోకుండా చూసుకుంటామని కోరడంతో విడిచిపెట్టారు.

పెరిగిన టమాట ధరలు

- పలమనేరులో బాక్సు రూ.300


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

పలమనేరు: స్థానిక టమాట మార్కెట్‌లో టమాట ధరలు పెరిగాయి. సోమవారం 15 కిలోల బాక్సు ధర రూ.110 నుంచి రూ.300 వరకు పలికింది. మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, స్థానిక కార్యదర్శి సంజీవకుమార్ స్థానిక టమాట వ్యాపారులు, మండీ యజమానులో మాట్లాడి ధరలు పెరిగేలా చూడాలని సూచించారు. దీనికి తోడు పలు రాష్ట్రాల నుంచి టమాట వ్యాపారులు కొనుగోళ్ల కోసం మార్కెట్‌కు రావడంతో ధర పెరిగింది. మరోవైపు అనంతపురం నుంచి సరుకు తగ్గడమే ధరల పెంపునకు కారణమైందన్న మాట వినిపిస్తోంది.

ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి సిటీ: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు కోర్సులలో ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యాయి. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు పరీక్షలను ఆయా వర్సిటీలు నిర్వహించనున్నాయి. ఇప్పటికే పలు ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణ, గడువుతేదీ, పరీక్షల తేదీలు ఇలా...

ప్రవేశ పరీక్ష	దరఖాస్తుల స్వీకరణ	తుది గడువు	పరీక్ష తేదీ
ఏపీ పీజీసెట్	ఏప్రిల్ 2వ తేదీ నుంచి	ఏప్రిల్ 30	జూన్ 9 నుంచి 13 వరకు
ఏపీఈసెట్	మార్చి 12	ఏప్రిల్ 7	మే 6
ఏపీఐసెట్	మార్చి 13	ఏప్రిల్ 9	మే 7
ఏపీ పాలీసెట్	మార్చి 12	ఏప్రిల్ 15	ఏప్రిల్ 30
ఏపీ లాసెట్	మార్చి 25	ఏప్రిల్ 27	మే 25
ఏపీపీజీఈసెట్	ఏప్రిల్1	ఏప్రిల్ 30	జూన్ 5 నుంచి 7వరకు
ఏపీ ఈఏపీసెట్	మార్చి 15	ఏప్రిల్ 24	మే 19, 20
ఏపీ ఎడ్‌సెట్	ఏప్రిల్18	మే 15	జూన్ 8

హామీలను నిలబెట్టుకోండి


ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

తిరుపతి అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య కోరారు. లీలామహల్ సర్కిల్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో వారు మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తరహాలో ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలను ఎప్పటికప్పుడు చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని సూచించారు. పెండింగ్‌లో లేకుండా రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ నగదు చెల్లించాలని, ఆర్టీసీ పదోన్నతులు చూడాలని, 11వ పీఆర్‌సీకి సంబంధించి 24 నెలల బకాయిలు, డీఏ, బకాయిలు, సరండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు అందించాల్సిన వైద్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కూటమి సర్కార్ ఉద్యోగులకు అందించాల్సిన ఆర్థికపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి చూపడం లేదని వాపోయారు. వారి వెంట ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సత్యానారాయణ, అర్జునయ్య, మస్తాన్, ఆవుల ప్రభాకర్‌యాదవ్, గురున్నాథం, సతీష్‌నాయుడు, సుబ్రమణ్యంరాజు, దాసరి బాబూ సామ్యూల్ ఉన్నారు.